7

# సాక్షి జనగామ

ఆదివారం | 1 | జనవరి | 2023



న్యూ ఇయర్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఏబీవీ కళాశాల వద్ద శనివారం అర్ధరాత్రి కేక్ కట్ చేసి కేరింతలు కొడుతున్న విద్యార్థినులు



# నయా జోష్..

## 2023 నూతన సంవత్సరానికి ఘన స్వాగతం

- అర్ధరాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసి సంబరాలు
- డీసీపీ పర్యవేక్షణలో పోలీసుల బందోబస్తు

జనగామ: తీపి గురుతులు.. చేదు అనుభవాలను మూటగట్టుకుని 2022 సంవత్సరం చరిత్ర పుటల్లో కలిసి పోయింది. చీకటి నుంచి వెలుతురు వైపు పరుగులు తీస్తూ.. కోటి ఆశల నవవసంతం కొత్త పేజీలు తెరుచుకుంది. అర్ధరాత్రి 12 గంటలకు 2023 నూతన ఆంగ్ల సంవత్సరానికి జిల్లా ప్రజలు ఘనస్వాగతం పలికారు. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ చిన్నా పెద్దా తేడా లేకుండా కేరింతలు కొట్టారు. పట్టణంతోపాటు మండలాలు, గ్రామాల్లో కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మద్యరాత్రి రోడ్డు ప్రమాదాలు, గొడవలు, ర్యాష్ డ్రైవింగ్‌ను నివారించేందుకు డీసీపీ పి.సీతారాం పర్యవేక్షణలో ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, సీఐలు ఎలబోయిన శ్రీనివాస్, నాగబాబు, విశ్వేశ్వరావు, ఎస్సైల ఆధ్వర్యాన పోలీసులు పకడ్బందీగా బందోబస్తు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఎనిమిది డ్రంకెన్ డ్రైవ్ చెక్ పోస్టుల్లో రాత్రి 11 గంటల తర్వాత ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మద్యం దుకాణాల సమయం పెంచడంతో లిక్కర్ బిజినెస్ జోరుగా సాగింది. క్వింటాళ్ల కొద్ది కేక్‌లు అమ్ముడు పోయాయి. ఆదివారం ఆలయాలకు భక్తులు పోటెత్తే అవకాశం ఉండడంతో అందుకు తగినట్టుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

## మరింత ఉత్సాహంతో..

కొత్త ఆలోచనలు, పక్కా ప్రణాళికలతో అభివృద్ధి వైపు అడుగులు వేస్తాం. ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా నూతన సంవత్సరంలో మరింత ఉత్సాహంతో కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కలెక్టర్ శివలింగయ్య, డీసీపీ సీతారాం పేర్కొన్నారు. న్యూ ఇయర్ సందర్భంగా వారి మనోగతాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

## తెలంగాణకు ఆదర్శంగా ఉమ్మడి వరంగల్



అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో ఉమ్మడి వరంగల్‌ను తెలంగాణకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దుతాం. 2022లో సీఎం కేసీఆర్ నాయకత్వంలో పంచాయతీరాజ్, గ్రామీ ణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల్లో నిర్వహించిన అనేక కార్యక్రమాలకు దేశస్థాయిలో అవార్డులు వచ్చాయి. ఉమ్మడి వరంగల్‌లో విద్య, వైద్యం, సాగునీరు, వ్యవసా యం, ప్రజాసంక్షేమ, అభివృద్ధి పథకాలకు రూ.వేల కోట్లు ఖర్చు చేశాం. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాం. ఈకృషిలో భాగమైన ప్రతి ఒక్కరికీ కతజ్ఞతలు. 2023లో కూడా అందరూ మరింత ఉత్సాహంతో పనిచేసి ప్రజలకు మేలు చేయాలి. ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి.

- ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర మంత్రి

## స్వింగ్ స్పీడ్‌తో ముందుకు..



కొత్త సంవత్సరంలో జిల్లా అభివృద్ధి మరింత వేగంగా జరిగేలా స్వింగ్ స్పీడ్‌తో ముందుకెళ్తాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చూస్తాం. సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. క్రీడా ప్రాంగణాలు నూరు శాతం ఏర్పాటు చేశాం. వాటిలో పూర్తి స్థాయి వసతులు కల్పించి వినియోగంలోకి తెస్తాం. పూర్తయిన ప్రకృతి వనాల్లో అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. 'మనఊరు–మనబడి' కింద ఎంపిక చేసిన 24 స్కూళ్లలో పనులు చివరి దశకు చేరా యి. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- సీహెచ్.శివలింగయ్య, కలెక్టర్

## ఆందోళనలకు అనుమతి తప్పనిసరి



రాజకీయ, ప్రజా, విద్యార్థి సంఘాలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలకు కొత్త ఏడాది నుంచి అనుమతి తప్పనిసరి. ముందుగా ఏసీపీకి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతి ఇస్తాం. అనవసరంగా పబ్లిక్ న్యూసెన్స్ చేస్తే చర్యలు తప్పవు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఇందుకు మేము వ్యతిరేకం కాదు. మితిమీరిన చర్యలతోనే సమస్య. అందుకే ముందస్తు అనుమతి నిబంధనను కొత్త సంవత్సరంలో అమలు చేస్తున్నాం. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు..

- పి.సీతారాం, వెస్ట్‌జోన్ డీసీపీ



జనగామ పట్టణంలో సంబురాలు చేసుకుంటున్న పోలీసులు










## ప్రజలంతా బాగుండాలి



జనగామ: కొత్త సంవత్సరంలో అధికారులు ఉత్సాహంతో పనిచేసి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. న్యూఇయర్‌లో జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలంతా బాగుండాలని ఆకాంక్షించారు.

## శ్రీసోమేశ్వరస్వామికి బంగారు కిరీటం



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి వారికి సుమారు రూ.6.5 లక్షల విలువైన బంగారు కిరీటాన్ని శనివారం సూర్యాపేటకు చెందిన కీసర వెంకటేశ్వర్‌రెడ్డి–జయశ్రీ దంపతులు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, అర్చకులు రామన్న, లక్ష్మన్న, డీవీఆర్.శర్మ, అనిల్‌కుమార్, నాగరాజు, సూపరింటెండెంట్ వెంకటయ్య పాల్గొన్నారు.







# క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడా పోటీల్లో గెలుపు, ఓటమి అనేది సహజం.. ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. నమిలిగొండలో కడియం ఫౌండేషన్ ఆధ్వర్యాన 15 రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం కడియం శ్రీహరి పోటీలను పర్యవేక్షించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించడానికే క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, ఇందులో 90 టీంలకు పైగా పాల్గొంటున్నాయని చెప్పారు. ఈనెల 6వ తేదీన ఫైనల్స్ ఉంటాయని, క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఇదిలా ఉండగా.. కడియం ఫౌండేషన్ సహకారంతో స్వాగత్ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి ఛాగల్లులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సంబంధించి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశా ల మైదానాన్ని కడియం పరిశీలించా రు. ఏర్పాట్లపై సర్పంచ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, జాయింట్ సెక్రటరీ తోటకూరి వెంకటేశ్వర్లుతో చర్చించా రు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, నమిలిగొండ ఎంపీటీసీ రజాక్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు బూర్ల శంకర్‌ముదిరాజ్, కోతి రాములు, రాజేష్‌నాయక్, ఎడ్ల వెంకటస్వామి, రవినాయక్, దశరథ్ నాయక్, అయోధ్య, సుధాకర్‌బాబు, ఎల్మకంటి నాగరాజు, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



# రేపు ఉత్తర ద్వార దర్శనం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ, చైర్మన్

చిల్పూరు: శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం న్యూ ఇయర్ వేడుకలతో పాటు 2వ తేదీన స్వామివారిని భక్తులు ఉత్తర ద్వారం నుంచి దర్శించుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో అర్చకులు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు.

# రహదారులు అద్దంలా మెరవాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఎర్రబెల్లి

జనగామ: గ్రామీణ ప్రాంత పీఆర్ రహదారులు వచ్చే వానాకాలం నాటికి అద్దం మాదిరిగా మెరిసేలా తయారు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి పారుదల శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రంగారెడ్డి జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్ నుంచి అన్ని జిల్లాల సూపరింటెండెంట్ ఇంజనీర్లతో కలిసి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రోడ్లపై ఎక్కడా గుంతలు కనిపించొద్దని, సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావలసిన రూ.1,100 కోట్ల నిధులను కావాలనే పెండింగ్‌లో ఉంచిందని, దీంతో ఆర్థికంగా కొంత ఇబ్బంది పడాల్సి వచ్చిందని చెప్పారు. కేంద్రంతో సమానంగా గ్రాంట్స్ మంజూరు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. సర్పంచ్‌లకు అన్ని విధాల అధికారాలు ఇచ్చామని, కొందరు మాత్రం బీజేపీ ట్రాప్‌లో పడి అనవసరంగా దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ వివరాలతో బోర్డులను జీపీల ఎదుట ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి రూ.5 కోట్లతో రోడ్లకు ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు, సంక్షేమంపై అనునిత్యం సమీక్షలు నిర్వహిస్తూ.. ప్రభుత్వం ఆశించిన మేర లక్ష్యాలను చేరుకునేలా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. డీఆర్డీఓ రాంరెడ్డి, డీపీఓ వసంత, డీఎల్‌పీఓ పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్, ఇతర అధికారులు



# ఇక నిత్యం ఎల్ఎస్ఏ సేవలు

- రేపు వర్చువల్‌గా ప్రారంభం
- జిల్లా న్యాయమూర్తి కె.శైలజ


మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి శైలజ

జనగామ: ఉమ్మడి వరంగల్ పరిధిలోని లీగల్ సర్వీసెస్ అథారిటీ సేవలు(అందరికీ ఉచిత న్యాయం) ఇక నుంచి జిల్లా పరిధిలో నిత్యం కొనసాగుతాయని జిల్లా న్యాయమూర్తి, లీగల సర్వీసెస్ అథారిటీ చైర్మన్ కె.శైలజ అన్నారు. శనివారం కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి పి.ఆంజనేయులు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డీటీ పృథ్వీరాజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్.నర్మదతో కలిసి ఆమె మాట్లాడారు. సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన భవనంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సేవలను హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భయాన్, హైకోర్టు న్యాయమూర్తి పి.నవీన్‌రావు హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఇక నుంచి లీగల్ సర్వీసెస్‌తో పాటు ప్రతిరోజు లోక్‌అదాలత్ సేవలు, ఏడాదికి నాలుగుసార్లు జాతీయ లోక్‌అదాలత్ ఉంటుందని తెలిపారు. ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు ప్రభుత్వ న్యాయవాది మాదిరిగానే.. రెండేళ్ల కాలానికి ప్రైవేట్ అడ్వకేట్‌ను ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. లీగల్ సర్వీసెస్‌లో ఇరుపక్షాలు రాజీకుదుర్చుకున్నట్లు ఒప్పుకున్న వెంటనే కేసు కొట్టివేసి అవార్డు ఇస్తారని, అప్పీల్ కోసం పైకోర్టుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. కోర్టులో ఒకరికి న్యాయం జరిగితే, లోక్ అదాలత్‌లో ఇద్దరికి న్యాయం జరిగే అవకాశం ఉంటుందని వివరించారు. లోక్ అదాలత్‌లో వివాదం పరిష్కారం కాకుంటే సివిల్ కేసుల సమయంలో కోర్టులో డిపాజిట్ చేసే నగదు వాపస్ ఇస్తారని చెప్పారు. ప్రీలిటిగేషన్ కేసులను సైతం లీగల్ సర్వీసెస్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉందని, ఈ సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఇందుకు పారాలీగల్ వలంటీర్లు పని చేస్తారని అన్నారు. జిల్లా ప్రజలకు ఆమె నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



# రోడ్డుపైకి చేరిన 'పంచాయతీ'

- కిరాయిదారు కాదనడంతో టెంట్ కిందే విధులు
- అధికారులు స్పందించకుంటే టెంట్ లేకుండానే నిర్వహిస్తాం : సర్పంచ్


టెంట్‌కింద ఏర్పాటు చేసిన కుర్చీల్లో కూర్చున్న సర్పంచ్, మరొకరు

చిల్పూరు: సరైన కిరాయి ఇవ్వడం లేదంటూ ఇంటి యజమాని ఖాళీ చేయించడం, గ్రామంలో మరోచోట అనువైన భవనం లేకపోవడం, నూతన గ్రామ పంచాయతీలకు మంజూరు చేసిన భవనాల్లో గ్రామం పేరు లేకపోవడంతో నిరసనగా రోడ్డుపై టెంట్ వేయించి పంచాయతీ కార్యాలయంగా మార్చాడు గ్రామ సర్పంచ్. ఈ సంఘటన శనివారం చిల్పూరు మండలం వెంకటేశ్వరపల్లిలో చోటు చేసుకుంది. సర్పంచ్ తోకల దివాకర్‌రెడ్డి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. వెంకటాద్రిపేట గ్రామ పంచాయతీకి అనుసంధానంగా ఉన్న వెంకటేశ్వరపల్లిని నూతన గ్రామ పంచాయతీగా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఊరుకు ప్రత్యేకంగా పంచాయతీ భవనం, డీలర్‌షిప్, అభివృద్ధి నిధులు మంజూరు అవుతాయని ఎంతో ఆశించారు. 8 వార్డులుగా గ్రామ పంచాయతీగా ఏర్పాటు కాగానే గొల్లెన నాగరాజుకు చెందిన ఓ చిన్న గదిని కార్యాలయానికి అద్దెకు తీసుకున్నారు. రెండున్నర ఏళ్ల తరువాత వారు ఖాళీ చేయమనడంతో పులిగిల్ల ఎల్లయ్యకు చెందిన చిన్నగదిని అద్దెకు తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం పాత వాటితో పాటు నూతన గ్రామ పంచాయతీలకు భవనాలను మంజూరు చేసింది. అందులో పాత జీపీలుగా ఉన్న రాజవరం, శ్రీపతిపల్లి, కృష్ణాజీగూడెం, లింగంపల్లితోపాటు కొత్తగా ఏర్పాటు అయిన గార్లగడ్డతండా, తీగల తండాలకు భవనాలు మంజూరు చేయగా వెంకటేశ్వరపల్లికి మంజూరు చేయలేదు.

**ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యమే: దివాకర్‌రెడ్డి, సర్పంచ్**

ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతోనే తమ గ్రామానికి భవనం మంజూరు ఇవ్వలేదు. పంచాయతీగా ఏర్పాటు అయిన నాటినుంచి తన సొంత నిధుల నుంచి కిరాయి చెల్లించాను. వారు ఖాళీ చేయించాక మరో భవనం కోసం అడ్వాన్స్ రూ.10 వేలు అడిగారు. 15వ ఫైనాన్స్ నిధులనుంచి ఇద్దామనుకుంటే నాకు తెలియకుండా ఎంపీఓ మధుసూదన్ రూ.9వేలు డ్రా చేసుకున్నాడు. ఇదేమని అంటే సమాధానం ఇవ్వలేదు. దీంతో నేనే చెల్లించాను.





**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.